క్లుప్తంగా

నేడు కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి పరిచయ కార్యక్రమం

కోదాడ/ హుజూర్‌నగర్ : నల్లగొండ- ఖమ్మం - వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న పరిచయ కార్యక్రమాన్ని కోదాడ, హుజూర్‌నగర్‌లలో నిర్వహించనున్నట్లు రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతిరెడ్డిలు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కోదాడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సాయంత్రం 3 గంటలకు, హుజూర్‌నగర్‌లోని మంత్రి నివాసంలో 5.30 గంటలకు కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

23 నుంచి ఇంటర్ స్పాట్ అడ్మిషన్లు ప్రారంభం

మేళ్లచెరువు : మండల కేంద్రం పరిధిలోని గిరిజన గురుకుల బాలుర కళాశాలలో ఈ నెల 23వ తేదీ నుంచి ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరేందుకు స్పాట్ అడ్మిషన్లు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మురళి తెలిపారు. శనివారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో అడ్మిషన్లు కలవని పేర్కొన్నారు. మొత్తం 40 సీట్లలో గిరిజన విద్యార్థులకు 36 ఇతరులకు 4 సీట్లు ఉన్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు కళాశాలలో సంప్రదించాలని కోరారు.

గీత కార్మికుడికి పరామర్శ

కోదాడరూరల్ : మేళ్లచెరువు మండల పరిధిలోని కందిబండ గ్రామానికి చెందిన కేసగాని బ్రహ్మం తాటిచెట్టు పైనుంచి పడడంతో గాయాల పాలై కోదాడ పట్టణంలోని ఓ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. శనివారం కౌండిన్య గౌడ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కెఎల్ఎన్ ప్రసాద్ అతన్ని పరామర్శించారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో వెంటనే ఎక్స్‌గ్రేషియా మంజూరు అయ్యేవిధంగా చొరవ చూపుతానని తెలిపారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. ఆయన వెంట కేసగాని వీరబాబు, బ్రహ్మం కుటుంబసభ్యులు ఉన్నారు.

నేటి నుంచి హరిహర క్షేత్రంలో బ్రహ్మోత్సవాలు

నడిగూడెం : మండల పరిధిలోని రత్నవరంలో గల హరిహర క్షేత్రంలో ఆదివారం నుంచి 21వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఈమేరకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం సుప్రభాత సేవ, మామిడి తోరణాలు, గణపతి పూజ, పంచామృతాభిషేకాలు 20న జలాభిషేకం, పంచామృతాభిషేకం, బొడ్రాయి వద్ద అభిషేకాలు, ముత్యాలమ్మ, మారెమ్మ, మహంకాళీ ఆలయాల వద్ద దూపదీప నైవేద్యాలు, తీర్థ ప్రసాదాలు, 21న గణపతి పూజ, చండీ హోమం, అన్నదానం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : సిమెంటు పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను, జిల్లా నాయకుడు వట్టెపు సైదులు అన్నారు. శనివారం చింతలపాలెం మండలం దొండపాడులో నిర్వహించిన సీఐటీయూ యూనియన్ సమావేశంలో వారు మాట్లాడారు. సిమెంట్ పరిశ్రమలో పనిచేసే కాంటాక్ట్ కార్మికులకు రక్షణ కల్పించడంలో ఆయా యాజమాన్యాలు వైఫల్యం చెందుతున్నాయని ఆరోపించారు. కార్మికుల న్యాయమైన కోరికలను తీర్చాలని వారి డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు శౌరి, హుస్సేన్, జయరాజు, జోజప్ప, రవి, శ్రీను, వెంకయ్య, నాగయ్య, వీరబాబు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కాసులుకు నివాళి



కాసులు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మఠంపల్లి : మండలంలోని యాతవాకిళ్లలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దివంగత ఎస్‌కె కాసులు 4వ వర్ధంతిని శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీసీసీ అధికార ప్రతినిధి కుక్కల నాగరాజు, కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వంటిపులి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ కాశయ్య, గడ్డం వీరయ్య, బండి వెంకటరెడ్డి, కీసర వెంకన్న, సైదులు, గురువయ్య, వెంకన్న, బాల నాగయ్య, అంజి, మట్టయ్య, గోవింద్‌గౌడ్, నాగులు, వెంకటేశ్వర్లు, లింగయ్య, కుటుంబసభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నేరేడుచర్ల : మున్సిపాలిటీలో జాన్‌పహాడ్ రోడ్డు విస్తరణలో భాగంగా టౌన్ -1 ఫీడర్ కింద విద్యుత్ స్తంభాలను మార్చుతున్నందున ఆదివారం ఉదయం 8 గంటల నుంచి 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ పందిరి శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

కబ్జా కోరల్లో ఊరచెరువు!

- సుమారు 50 ఎకరాల శిఖం భూమిని ఆక్రమించిన కబ్జాదారులు
- హద్దులు ఏర్పాటు చేయాలని కోరుతున్న రైతులు



దిర్శించర్లలో కబ్జాకు గురైన ఊర చెరువు

నేరేడుచర్ల : మండలంలోని దిర్శించర్ల గ్రామ సమీపంలో గల ఊరచెరువు కబ్జాకు గురవుతోంది. చెరువు చుట్టూ హద్దు రాళ్లు లేకపోవడంతో ఏటేటా శిఖం భూమిని కొద్దికొద్దిగా ఆక్రమిస్తున్నారు. చుట్టు పక్కల పంట భూములు గల రైతులు ఊరచెరువు శిఖం భూమిని అదే చెరువు మట్టితో పూడబోసి సాగు చేసుకుంటున్నారు. సర్వే నంబర్ 52లో ఊర చెరువు 111.66 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. అందులో సుమారు 50 ఎకరాల వరకు ఆక్రమణకు గురైంది. అయితే ఊరచెరువు ఆధారంగా సుమారు 150 ఎకరాల వరకు రైతులు సాగు చేస్తున్నారు. ప్రతి ఏటా చెరువు కబ్జాకు గురి అవుతుండడంతో వారు ఆందోళన చెందుతున్నారు. చెరువు ఆక్రమణ విషయమై అనేకసార్లు అధికారులకు వినతులు ఇచ్చిన ఎలాంటి స్పందన లేదని ఆరోపిస్తున్నారు.

చెరువు ఎండిపోవడంతో..

ప్రస్తుతం వర్షాభావ పరిస్థితుల కారణంగా చెరువులో నీటి చుక్క లేకుండా ఎండిపోయింది. దీంతో చెరువు చుట్టూ పక్కల భూములు గల కొందరు రైతులు ఆక్రమణను పాల్పడుతున్నారు. గతంలో ఈ చెరువు పూడికతీత పనులకు మిషన్ కాకతీయ కింద రూ.33 లక్షలతో చేశారు. కానీ కాంట్రాక్టర్లు ఆక్రమణకు గురైన చెరువు శిఖం జోలికి పోకుండా పూడికతీత పనులు చేసి చేతులు దులుపుకున్నారు. కాగా, ఇటీవల యథేచ్ఛగా చెరువు కబ్జా అవుతుండడంతో కొందరు రైతులు జిల్లా కలెక్టర్‌కు పిర్యాదు చేశారు. దీంతో తహసీల్దార్.. పోలీస్ అధికారులతో చెరువు చెరువు ఆక్రమణను పరిశీలించారు. చెరువును ఆక్రమించిన రైతులు వెంటనే శిఖం భూమిలో పోసిన మట్టిని తొలగించాలని, లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు సైతం హెచ్చరించారు. చెరువులో జేసీబీలతో మట్టిని తవ్వి తరలిస్తే వారిపై చట్టరిత్యా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు. రెవెన్యూ, నీటిపారుదల అధికారులు సమన్వయంతో చెరువుకు హద్దురాళ్ల నిర్ణయించి ఆక్రమణకు గురికాకుండా చూడాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

చెరువు భూమి ఆక్రమిస్తే చర్యలు



చెరువు శిఖం భూమి ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. నీటి పారుదల అధికారుల సమన్వయంతో చెరువులో హద్దురాళ్లు ఏర్పాటు చేస్తాం. జేసీబీతో చెరువులను తవ్వితే కేసులు నమోదు చేస్తాం. ఉపాధి హామీ కూలీల ద్వారానే చెరువు పూడిక తీత పనులు చేపడతాం.

– సురిగి సైదులు, తహసీల్దార్, నేరేడుచర్ల

జీవాల పెంపకంలో జాగ్రత్తలు తీసుకోవాలి



అస్వస్థతకు గురైన మేకలను పరిశీలిస్తున్న డాక్టర్ పెంటయ్య

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : జీవాల పెంపకంలో పెంపకందారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని పశువైద్య శాఖ జిల్లా సహాయ సంచాలకులు డాక్టర్ పి.పెంటయ్య అన్నారు. చింతలపాలెం మండలంలోని యర్రకుంటతండాకు చెందిన పలువురి గొర్రెలు, మేకలు అడవిలో మేత మేసి అస్వస్థతకు గురయ్యాయి. అందులో 5 మేకలు చనిపోయాయి. బాధితుల పిర్యాధు మేరకు శనివారం ఆయన అస్వస్థతకు గురైన వాటిని పరిశీలించారు. అడవిలోని గుంటల్లో సేకరించిన నీటి నమూనాలను పరీక్షల నిమిత్తం హైదరాబాద్‌కు పంపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిల్వ ఉన్న వర్షపు నీరు తాగడం వల్ల చనిపోయి ఉండవచ్చని అన్నారు. బీడు భూముల్లో జొన్న జాతికి చెందిన పిలకలు మేపవద్దని సూచించారు. ఆయన వెంట పశువైద్యాధికారి మధు, బాధిత రైతులు ఉన్నారు.

కల్యాణోత్సవానికి హాజరు కావాలని మంత్రికి ఆహ్వానం



మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఆహ్వానపత్రిక అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కోదాడరూరల్ : కోదాడ మండల పరిధిలోని ఎర్రవరంలో ఈ నెల 21వ తేదీ నుంచి 23 వరకు జరిగే దూళ్లగుట్ట శ్రీబాల ఉగ్రలక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవానికి హాజరు కావాలని కోరుతూ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డిలకు ఆలయ కమిటీ సభ్యులు శనివారం ఆహ్వాన పత్రిక అందజేశారు. ఆలయం వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మంత్రికి వివరించారు. కల్యాణ వేడుకలను హాజరవుతానని మంత్రి చెప్పినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు భాషబోయిన భాస్కర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ నలజాల శ్రీనివాసరావు, షేక్.లతీఫ్, వేమూరు మధు, వీరేపల్లి నాగేంద్రప్రసాద్, బెల్లంకొండ ఉపేందర్, రావుల వెంకటేశ్వర్లు, వల్లెపు సుదర్శన్, చడపంగు వెంకటేశ్వర్లు ఉన్నారు.

వాసవీ కన్యకాపరమేశ్వరి జన్మదిన వేడుకలు



కోదాడరూరల్ : పూజలో పాల్గొన్న భక్తులు



కోదాడరూరల్ : అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే చందర్‌రావు



నేరేడుచర్ల : శివాలయంలో పూజలు చేస్తున్న వాసవీ, వనిత క్లబ్ సభ్యులు

కోదాడరూరల్ : కోదాడ పట్టణంలోని కోదండ రామాలయంలో శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి జన్మదినవేడుకలను శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం సుప్రభాతసేవ, గణపతి పూజ, పంచామృతాభిషేకాలు, తీరొక్క పూలతో అమ్మవారికి పుష్పాలంకరణ, లలితాసహస్రనామం, సాయంత్రం పవళింపు సేవ వంటి పూజా కైంకర్యాలను కనుల పండువగా నిర్వహించారు. కుంకుమ పూజలో మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు. నాగుబండి వీరయ్య భద్రమ్మ మెమోరియల్ చాటిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో యర్రా వెంకటనారాయణ జ్ఞాపకార్థం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, పీసీసీ సభ్యుడు చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, వంగవీటి రామారావు, యర్రా భారతమ్మ, యర్రా శ్రీనివాసరావు, జ్యోతి, చంద్రశేఖర్, అనూష, వశిష్ట, గాయత్రి, విదిగ్నచారుహాసిని, వెంకటనారాయణ, గరిడేపల్లి లక్ష్మణ్‌రావు, శ్రీను, నాగభూషణం తదితరులు ఉన్నారు.

వాసవీ, వనిత క్లబ్‌ల ఆధ్వర్యంలో..

నేరేడుచర్ల : పట్టణంలో వాసవీమాత జన్మదిన వేడుకలను వాసవీ, వనిత క్లబ్‌ల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నపూర్ణ విశ్వేశ్వరాలయంలో మహిళలు సామూహిక కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాసవీ, వనిత క్లబ్ అధ్యక్షులు జెల్లి లక్ష్మీనర్సింహారావు, లక్ష్మీప్రసన్న, వైస్ ఎంపీపీ తాళ్లూరి లక్ష్మీనారాయణ, వాసవీ క్లబ్ జోన్ చైర్మన్ కొత్త లక్ష్మణ్, వీరేల్లి శ్రీలత, అశోక్, శ్రీనివాస్, శ్రీనివాస్‌రావు, మహాలక్ష్మి, పరమేశం, అంజయ్య, మోహన్ తదితరులు ఉన్నారు.

రైతుబంధు, బీమా వర్తింపజేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కోదాడరూరల్ : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టిన విధంగా కౌలు రైతులకు రైతు బంధు, రైతు బీమా వర్తింపజేయాలని ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు మేకల శ్రీనివాసరావు, కౌలు రైతు సంఘం రాష్ట్ర కారదర్శి అన్నెం పాపిరెడ్డి కోరారు. శనివారం కోదాడ పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బొల్లు ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన కౌలు రైతుల సమావేశంలో వారు మాట్లాడారు. కౌలు రైతులు రైతు బంధు, బీమా పథకాలకు ఆకర్షితులై అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీకి మద్దతు ప్రకటించారని తెలిపారు. ఈ వానాకాలం సీజన్ నుంచే కౌలు రైతులను గుర్తించి ఈ పథకాలను అమలు చేయాలని, బ్యాంకులు లోన్లు కూడా ఇవ్వాలని, ధాన్యానికి బోనస్ కూడా వర్తింపజేయాలన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీఓ కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో లతీఫ్, కుటుంబరావు, చిన్న వెంకట్‌రెడ్డి, కనగాల గిరి, అల్వాల గుర్వయ్య, శ్రీను, పుల్లయ్య, నాగేశ్వరరావు, ఉపేందర్, వెంకట్, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

● వికసించిన మే పుష్పం



చింతలపాలెం మండల కేంద్రంలోని షేక్ అబ్బాస్ ఇంట్లో గల పెరటిలో మే పుష్పం వికసించింది. ఏడాదికి ఒకసారి మాత్రమే పువ్వు పుసే ఈ మొక్కను గత 25 ఏళ్లుగా పెంచుతున్నట్లు అబ్బాస్ తెలిపారు. కాగా, ఫైర్ బాల్ లిల్లీ, బ్లడ్ లిల్లీ అనే అరుదైన జాతికి చెందిన ఈ పువ్వు ఏప్రిల్, మే నెలల్లోనే వికసిస్తుంది. దీంతో భారతదేశంలో దీనిని మే పుష్పం అని పిలుస్తారు.

– హుజూర్‌నగర్ (చింతలపాలెం)

ఎన్ఎస్‌పీ భూమి ఆక్రమణకు యత్నం!



రామాపురంలో ఎన్ఎస్‌పీ భూమిని ఆక్రమించేందుకు తోలుకున్న రాళ్లు

చిలుకూరు : మండల పరిధిలోని రామాపురం గ్రామంలో గల ఎన్ఎస్‌పీ కాలువ భూమిని ఆ గ్రామానికి చెందిన పలువురు మాజీ ప్రజాప్రతినిధులు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారు. చిలుకూరు నుంచి రామాపురం వెళ్లే రోడ్డులో రైస్ మిల్లుకు వెళ్లే దారిలో ఈ భూమి ఉంది. అయితే ఎన్ఎస్‌పీ కాలు భూమిపై కన్నేసిన మాజీ ప్రజాప్రతినిధులు రాత్రికి రాత్రే మట్టి, రాళ్లు తోలి గోడ నిర్మించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ విషయంపై గ్రామంలో పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. మాజీ ప్రజాప్రతినిధులు ఇలా కబ్జాకు పాల్పడడం ఏంటని అందరూ చర్చించుకుంటున్నారు. కాగా, ఆ భూమిలో కొంత భాగాన్ని ప్రభుత్వం క్రీడా ప్రాగణానికి కేటాయించారు. ఈ విషయంపై తక్షణమే ఎన్ఎస్‌పీ అధికారులు స్పందించి ఆక్రమణదారుల నుంచి భూమిని కాపాడాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు.

లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నడిగూడెం : మండల కేంద్రంలో శనివారం 59.3 మి.మి వర్షం కురిసిందని, మరో రెండు రోజులు పాటు వర్షం పడే అవకాశం ఉన్నందున లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జెడ్పీటీసీ సభ్యురాలు బాణాల కవిత కోరారు. శనివారం ఆమె స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. అధికారులు, ప్రజాప్రతినిధులు అందుబాటులో ఉండనున్నట్లు తెలిపారు.

ఏఐటీయూసీ నాయకుల పరామర్శ



సూర్యనారాయణను పరామర్శిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

హుజూర్‌నగర్ : చిలుకూరు వద్ద ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కొప్పోజు సూర్యనారాయణను శనివారం హుజూర్‌నగర్‌లోని ఆయన నివాసంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకొని ప్రజా ఉద్యమాల్లో పాల్గొనాలని వారు ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జెట్టి ప్రసాద్, సీపీఐ పట్టణ కార్యవర్గ సభ్యురాలు సుందరి పద్మ, మహిళా నాయకురాలు చింతకుంట్ల విజయ, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

నడిగూడెంలో భారీ వర్షం



నడిగూడెంలో బీసీ కాలనీలో రహదారిపై నిలిచిన వర్షపు నీరు



నడిగూడెం వాగులో ప్రవహిస్తున్న వరద

నడిగూడెం : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో శనివారం భారీ వర్షం కురిసింది. మండల వ్యాప్తంగా 59.03 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. నడిగూడెంలో కురిసిన వర్షానికి ఎస్సీ, బీసీ కాలనీలతో పాటు వివిధ గ్రామాల్లోని వీధులు జలమయమయ్యాయి. నడిగూడెంలోని వాగులో వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. నడివేసవిలో అకాల వర్షం కురవడంతో ప్రజలు ఎండనుంచి కాస్త ఉపశమనం పొందగా రైతులు మాత్రం హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సీఎంకు లేఖ

మిర్యాలగూడ టౌన్ : తెలంగాణ రాష్ట్రంలో పది యూనివర్సిటీలకు రాష్ట్ర ప్రభుత్వం నూతన వైస్ ఛాన్సలర్‌లను నియమిస్తున్నందున ఈ నియమకాల్లో బీసీలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కోరుతూ శనివారం సీఎం రేవంత్‌రెడ్డికి బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ లేఖను పంపారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సామాజిక న్యాయం కల్పిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు. బంధుప్రీతి, రాజకీయ అండదండలు ఉన్నవారిని కాకుండా ఉన్నత విలువలు కలిగిన వారిని మాత్రమే నియమించాలని ఆ పత్రంలో పేర్కొన్నారు.

అన్ని రకాల వడ్లకు బోనస్ ఇవ్వాలి

భానుపురి : రాష్ట్రంలో రైతులు పండించిన అన్నిరకాల వడ్లకు ప్రభుత్వం క్వింటాకు రూ.500ల బోనస్ ఇవ్వాల్సిందేనని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ డిమాండ్ చేశారు. శనివారం సూర్యాపేట పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి కేవలం సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామనడం అన్యాయమన్నారు. ఇప్పటికే అకాల వర్షాలతో ఐకేపీ సెంటర్లలో ఉన్న ధాన్యం తడిసి రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో అన్నిరకాల వడ్లు పండించిన రైతులకు బోనస్ ఇచ్చి ఆదుకోవాలన్నారు. సమావేశంలో మాస్‌లైన్ పార్టీ జిల్లా నాయకుడు కారింగుల వెంకన్న, నాయకులు కొత్తపల్లి రేణుక, ఎర్ర అఖిల్, ఎస్‌కే సయ్యద్, పిడమర్తి లింగన్న, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

పని ప్రదేశంలో ఉపాధి కూలీ మృతి

సూర్యాపేట : ఉపాధి హామీ పనులు చేస్తూ కూలీ మృతి చెందిన ఘటన సూర్యాపేట మండల పరిధిలోని సపావత్‌తండా ఆవాసం జేతునాయక్ తండాలో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు, ఉపాధి కూలీలు తెలిపిన వివరాల ప్రకారం.. జేతునాయక్‌తండాకు చెందిన రమావత్ సేవానాయక్ ఉపాధి హామీ పనుల్లో భాగంగా తండా పరిధిలోని చెరువులో పూడిక తీయడానికి వెళ్లాడు. మట్టి తీస్తుండగా అతడు ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. తోటి కూలీలు వెంటనే సేవానాయక్‌ను సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సేవానాయక్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మరుగుదొడ్ల నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న జడ్జి శ్యాంసుందర్

కోదాడరూరల్ : కోదాడ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణానికి జడ్జి ఎస్.శ్యాంసుందర్ శనివారం శంకుస్థాపన చేశారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్టు ఆవరణలో మరుగుదొడ్లు లేక సిబ్బంది ఇబ్బంది పడుతున్నారనే విషయాన్ని జిల్లా, హైకోర్టు న్యాయమూర్తులకు తెలపగా వెంటనే వారు స్పందించి అత్యాధునికమైన మొబైల్ మరుగుదొడ్లు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్.రామిరెడ్డి, న్యాయవాదులు మేకల వెంకట్రావు, ఎడ్లపల్లి వెంకటేశ్వర్లు, బండి వీరభద్రం, నాగుల్‌పాషా, కాంట్రాక్టర్ రామచందర్‌రావు ఉన్నారు.

20న కంటి వైద్యశిబిరం

భానుపురి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సూర్యాపేట కార్యాలయంలో వరంగల్‌కు చెందిన శరత్ మ్యాక్సీవిజన్ లేజర్ కంటి హాస్పిటల్ ఆధ్వర్యంలో పెన్షనర్లకు ఈ నెల 20వ తేదీన ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు దండా శ్యాంసుందర్‌రెడ్డి, సుదగాని నాగేశ్వర్‌రావులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్య పరీక్షలకు పెన్షనర్లు తమ హెల్త్‌కార్డులను వెంట తెచ్చుకోవాలని కోరారు.

భగవద్గీత పోటీల్లో బంగారు పతకం



బంగారు పతకాన్ని అందుకుంటున్న నాగలక్ష్మి

భానుపురి : సూర్యాపేట పట్టణానికి చెందిన బోనగిరి నాగలక్ష్మి మైసూర్‌లోని గణపతి సచ్చిదానంద స్వామీజీ చేతుల మీదుగా బంగారు పతకం పొందారు. కర్ణాటక రాష్ట్రం మైసూర్‌లోని గణపతి సచ్చిదానంద స్వామి దత్త పీఠం ఆశ్రమం వారు భగవద్గీతపై ఇటీవల ఆన్‌లైన్ ద్వారా పరీక్ష నిర్వహించారు. అయితే 25 నిమిషాల్లో భగవద్గీతలోని 18 అధ్యాయాలను ధారాళంగా చెప్పడంతో నాగలక్ష్మి బంగారు పతకం పొందారు.

21న ఎమ్మెల్సీ ఉప ఎన్నిక సన్నాహక సమావేశం

మిర్యాలగూడ : పట్టణంలోని ఎస్‌వీ గార్డెన్‌లో ఈనెల 21వ తేదీన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు తెలిపారు. శనివారం మిర్యాలగూడ పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ పట్టణ కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కర్‌రావు మాట్లాడారు. ఈ సన్నాహక సమావేశానికి మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి హాజరవనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశానికి పట్టభద్రులందరూ పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు రాకేష్‌రెడ్డికి వేసి గెలిపించేందుకు బీఆర్ఎస్ కార్యకర్తలు కృషి చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు అన్నభీమోజు నాగార్జునచారి, యడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు కరీం, పెండ్యాల పద్మ తదితరులు పాల్గొన్నారు.

వెంకటయ్య మృతి పార్టీకి తీరని లోటు



వెంకటయ్య మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

చిలుకూరు : చిలుకూరు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు కొడారు వెంకటయ్య మృతి పార్టీకి తీరని లోటని ఆ పార్టీ నాయకులు అన్నారు. శనివారం వెంకటయ్య మృతదేహం వద్ద పలు పార్టీల నాయకులు పూలమాలలు ఉంచి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్వాతంత్ర్య సమరయోధుడు దొడ్డా నారాయణరావు, వైస్ ఎంపీపీ జనపనేని జానకీకృష్ణారావు, టీడీపీ మండల అధ్యక్షుడు సాతులూరి గురవయ్య, మాజీ సర్పంచ్ కొడారు బాబు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై అంధకారం

- చిలుకూరులో రాత్రి వేళ వెలగని లైట్లు
- డివైడర్ కనిపించక ప్రమాదాలు
- తక్షణమే విద్యుత్ దీపాలు మార్చాలని గ్రామస్తుల వేడుకోలు



చిలుకూరులో కోదాడ- జడ్చర్ల రహదారిపై ఏర్పాటు చేసిన లైట్లు

చిలుకూరు : మండల కేంద్రంలో కోదాడ- జడ్చర్ల జాతీయ రహదారిపై విద్యుత్ లైట్లు వెలగడం లేదు. గత కొన్ని రోజులుగా లైట్లు వెలగకపోయినా సంబంధిత అధికారులు పట్టించుకోడం లేదు. అయితే జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా డివైడర్‌పై విద్యుత్ స్తంభాలకు లైట్లు ఏర్పాటు చేశారు. మొదట్లో లైట్లు బాగానే పని చేశాయి. కానీ ప్రస్తుతం ఒక్క లైట్ కూడా వెలగడం లేదు. దీంతో చిలుకూరు మండల కేంద్రంలో హైవే రోడ్డు రాత్రి సమయంలో అంధకారంగా మారుతోండడంతో ద్విచక్ర వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డివైడర్ ప్రారంభం, చివరలో రోడ్డు సక్రమంగా కనబడక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇటీవల వాహనాలు డివైడర్‌ను ఢీకొని నాలుగు ప్రమాదాలు జరిగాయి. గ్రామ శివారులో దగ్గరకు వచ్చే వరకు డివైడర్ సక్రమంగా కనబడక ప్రమాదాలు జరుగుతున్నాయి.

అనేకసార్లు ఫిర్యాదు చేసినా..

జాతీయ రహదారిపై లైట్ల విషయంపై చిలుకూరు గ్రామస్తులు అధికారులకు అనేకసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని అంటున్నారు. ఏర్పాటు హైవే కానప్పుడు గ్రామ పంచాయతీ వారు హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేసేవారని కానీ ప్రస్తుతం జాతీయ రహదారి అధికారులు లైట్లు ఏర్పాటు చేయడంతో గ్రామ పంచాయతీ వారు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు అంటున్నారు. చీకట్లో రాకపోకలకు ఇబ్బంది ఉందని ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే జాతీయ రహదారిపై లైట్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.